క్లుప్తంగా

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి



తెనాలిఅర్బన్: దోమల కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో బాలాజీరావుపేటలో వ్యాధులపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులు అన్నారు. నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే పాత గృహోపకరణాల్లో ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. దోమలు కుట్టుకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందెబాలచంద్రమౌళి, సచివాలయ అడ్మిన్ శాంతకుమారి, పట్టణ సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, దీపాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రోటరీ జిల్లా గవర్నర్ పర్యటన

తెనాలి: రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–3150 జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి శనివారం తెనాలిలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూలులో డైనింగ్ హాలు, సైకిల్ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడే దివ్యాంగులకు వీల్‌చైర్లు, గ్యాస్ ఐరన్ బాక్సులను పంపిణీ చేస్తారని రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు గౌతమ్ గ్రాండ్ హోటల్లో క్లబ్ అసెంబ్లీ, ఏడు గంటలకు బహిరంగసభలో పాల్గొంటారని వివరించారు. వీరితోపాటు డిప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, అసిస్టెంట్ గవర్నర్ మలినేని పెరుమాళ్లు పాల్గొంటారని తెలియజేశారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీడీవో దీప్తి

తెనాలిరూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో అతోట దీప్తి పేర్కొన్నారు. ప్రధానంగా శానిటేషన్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని కొన్ని మేజర్ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణలో సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. వీటిని త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుకుంటున్నామన్నారు. ఆయా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి పరిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడమే కాకుండా స్థానిక సమస్యలనూ పరిష్కరించేలా దేశాలు జారీ చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే ప్రజలు ఎంపీడీవో నంబర్ 9849903359/ మంత్రి నాదెండ్ల మనోహర్ ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ వాట్సాప్ నంబరు 7659935993 ద్వారా తెలియచేయవచ్చని సూచించారు.

జాబ్ మేళాలో 77 మందికి ఉద్యోగావకాశాలు

నగరం: స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు 173 మంది హాజరుకాగా వీరిలో 77 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాడెంట్ బుచ్చియ్యచౌదరి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్వీఆర్ఎం కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాను బుచ్చియ్య చౌదరి పరిశీలించి మాట్లాడారు. జాబ్‌మేళాకు టాటా క్యాపిటల్, అరబిందో ఫార్మసీ, మాస్టర్‌మైండ్స్, ఏయూ బ్యాంక్ ప్రతినిధులు ఇంటర్వ్యూలను నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వ్యూలలో 77 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, వెంకటేశ్వరావు, రవికుమార్ పాల్గొన్నారు.

21న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణస్వీకారం

వేమూరు: వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న బాపట్ల జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నాగార్జున ప్రమాణ స్వీకారం చేస్తారని వివరించారు. వేమూరు నియోజక వర్గం నుంచి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రమాణ స్వీకారోత్సం విజయం వంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

ప్రమాదకరంగా వాల్వ్ పిట్‌లు

- పరిష్కారానికి నోచుకోని నీటి సమస్య
- రహదారిపై అడ్డదిడ్డంగా సిమెంటు దిమ్మెలు



టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుకన్నా ఎత్తులో వాల్వ్ పిట్

తెనాలిరూరల్: పట్టణంలో సమగ్ర మంచినీటి పథకం ఆది నుంచి ప్రజలకు సమస్యలు తెచ్చిపెడుతోంది. పైపులైన్ల కోసం ఇళ్ల ముందు రోడ్డు తవ్వకాల నుంచి ఇప్పటి వరకు సుమారు 13 ఏళ్లు గడుస్తున్నా, ఇప్పటికీ ఈ పథకం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇంతే కాక పైపులైను లీకులు, కుళాయి కనెక్షన్లు పేరిట కొత్త సమస్యలూ వచ్చి పడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పురపాలక సంఘం నీటి పథకాన్ని కాంట్రాక్టు సంస్థ నుంచి స్వాధీనం చేసుకుంది. కాంట్రాక్టు సంస్థ ఏడాది పాటు నిర్వహించి, లోపాలను సరిదిద్ది పురపాలక సంఘానికి అప్పగించాల్సి ఉన్నా, అప్పట్లో నేతలు 'ఎందుకో' తొందరపడ్డారు. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

సమగ్ర మంచి నీటి పథకం పైపులైనుకు సంబంధించి వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. వీటి కోసం వాల్వ్ పిట్‌లను ఏర్పాటు చేసి, వాటికి కాంక్రీట్ దిమ్మెలను మూతలుగా పెట్టారు. చుట్టూ ఇనుప ఫ్రేమ్ పెట్టారు. ఈ పిట్‌లు కొన్ని చోట్ల రోడ్డుకన్నా ఎత్తుగానూ, కొన్ని చోట్ల రోడ్డు లెవల్‌కన్నా లోతుగానూ ఎత్తుగానూ ఏర్పాటు చేశారు. వీటి వల్ల ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, అధికారులకు పట్టడం లేదు.

మారిస్‌పేట రెండుగేట్ల మధ్య రోడ్డులో వాల్వ్ పిట్‌లపై ఏర్పాటు చేసిన, సిమెంట దిమ్మెలను తొలగించి, ఇనుప మూతను ఏర్పాటు చేశారు. నాసి రకం, పలుచగా ఉన్న ఇనుము వాడడంతో తుప్పు పట్టిపోయాయి. పిట్ మూతలు ఎత్తుగా ఉన్న చోట రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇనుప ఫ్రేమ్ ఉండడంతో కోణాలు గుచ్చుకుని కార్ల టైర్లు సైతం పగిలిపోతున్నాయి. పాండురంగపేటలో ఎన్టీఆర్ రోడ్డు, ఐతానగర్ పేరంటాళ్లమ్మ గుడి సమీపంలోని మలుపు వద్ద, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఇలా పట్టణంలో అనేక ప్రాంతాల్లో ఈ వాల్వ్ పిట్‌ల వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తున్నా, అధికారులుగానీ, ప్రజా ప్రతినిధులుగానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మారిస్‌పేట రెండుగేట్ల మధ్య రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న పైప్‌లైన్ వాల్వ్ మూత

అధికారుల సూచనలతో పురుగు మందులు వాడాలి

మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్

తెనాలిరూరల్: ఇటీవల అకాల వర్షాలు, వరదలు, అల్పపీడన ప్రభావంతో ఏర్పడిన వాతావరణ పరిస్థితులు కారణంగా రైతులు వరి పంటను సాగు చేసే దానిలో ఇబ్బందులు పడ్డారని, అయితే ప్రస్తుతం ఉన్న వరి పైరుకు అనేక రకాల చీడ పురుగుల ఆశించే అవకాశం లేకపోలేదని మండల వ్యవసాయాధికారి జి. ప్రేమ సాగర్ తెలిపారు. దీన్ని నివారించడానికి సరైన మందులు వాడుకోవాలని సూచించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పురుగులు ఆశించకుండా ఎలాంటి మందులు వాడాలన్న విషయంలో అవగాహన లేని రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. దోమ పోటుకు పైమెట్రోజైన్ 0.6 గ్రాములు, ట్రి ఫ్లూమిజోపైరిన్ 0.486 ఎంఎల్, డైనోటిఫ్యైరాన్‌లలో ఏదైనా వాడవచ్చన్నారు. ఎర్రనల్లి తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం పొడి లేదా కైకోఫాల్ 5ఎంఎల్, కానీ స్పైరోమెసిఫిన్ 1ఎంఎల్‌లలో ఏదైనా వాడవచ్చని వివరించారు. అంతే కాకుండా తెనాలి మండల పరిధిలో 17,665 ఎకరాలు ఈక్రాప్ చేయాల్సి ఉండగా 16,070 ఎకరాలను ఈకేవైసీ చేయటం జరిగిందని చెప్పారు. ఇంకా అరకొరగా చేయవలసి ఉందని వీటిని కూడా ఈ కేవైసీ చేస్తామని చెప్పారు. ఈ- క్రాపు కి నమోదైన పొలాలు వివరాలను 16వ తేదీన సోషల్ ఆడిట్ చేసి గ్రామ సభలో పెట్టినట్టు తెలిపారు. రైతులు ఈ వివరాలను రైతు సేవ కేంద్రాల ద్వారా తీసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి ప్రేమ్ సాగర్ తెలియజేశారు.

హామీ అమలుపై హర్షం

తెనాలి: స్వర్ణకారులకు తన పాదయాత్రలో ఇచ్చిన కార్పొరేషన్ హామీని నెరవేర్చినందుకు హర్షం వెలిబుచ్చుతూ శుక్రవారం స్థానిక శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి షేక్ నాసర్ అహ్మద్, కోశాధికారి మునగాల శ్రీనివాసరావు, స్వర్ణకార పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రయత్నాలను విరమించాలి

సీపీఎం నేత బాబూప్రసాద్ డిమాండ్



విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

తెనాలి: విద్యుత్ చార్జీల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సన్నాహాలను విరమించుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీపీఎం తెనాలి ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యుత్ కార్యాలయాల ఎదుట తమ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.8 వేల కోట్ల విద్యుత్ చార్జీల వసూలుకు అనుమతిని ఇవ్వాలని డిస్కంలు, విద్యుత్ రెగ్యులేషన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేశాయని బాబూప్రసాద్ తెలిపారు. అందుకు అనుగుణంగా రెగ్యులేటరీ కమిషన్ ప్రజాభీష్టం కోసం నోటీసులు జారీ చేసిందన్నారు. గతంలోనూ ఇలాగే జరిగి విద్యుత్ చార్జీలను పెంచి, వసూలకు అనుమతి వచ్చిందని చెప్పినట్టు గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే విద్యుత్‌చార్జీలను తగ్గిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ చార్జీలను పెంచేది లేదని హామీనిచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, హోటల్ తినుబండారాలు, పండ్లు ధరలు బాగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో విద్యుత్ చార్జీలను పెంచితే ప్రజలకు పెనుభారం కాగలదన్నారు. డిస్కంలు పెట్టిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీనిచ్చి, ప్రజలపై భారం పడకుండా చూడాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, ఎం.సాంబశివరావు, జి.వెంకట సుబ్బయ్య, కె.గోపి, ఎం.వెంకయ్య పాల్గొన్నారు. అనంతరం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వీవీ చిరంజీవిని కలిసి వినతిపత్రం అందజేశారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం



ఓటు నమోదు చేస్తున్న దృశ్యం

తెనాలి: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. యూటీఎఫ్ తెనాలి ప్రాంతీయశాఖల ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓటు నమోదు నిమిత్తం వచ్చిన పట్టభద్రులకు నమోదు చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు టీఎస్ఎన్ఎల్ మల్లేశ్వరరావు, జిల్లా అర్థిక కార్యదర్శి గయాసుద్దొలా, జిల్లా కార్యదర్శులు సాంబశివరావు, కేదార్‌నాథ్, కామాక్షి, ప్రసన్నత్, సతీష్, నాగేంద్రబాబు, కోటిసుందరరావు, వ్యవసాయ కార్మిక సంఘ బాధ్యులు ములకా శివసాంబిరెడ్డి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

మునగాకుతో ఆరోగ్యం



మునగాకుపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బాపట్లటౌన్/రేపల్లె రూరల్: మునగాకుతో ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.పద్మావతి తెలిపారు. పట్టణంలోని దేవుడిమాన్యంలో శుక్రవారం మునగాకు ఉపయోగాలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ మునగాకు క్రమం తప్పకుండా తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ఉపయోగకరమన్నారు. సుమారు 300 రోగాలను దూరం చేసే పోషకాలు ఒక్క మునగాకులోనే లభిస్తాయన్నారు. బాలింతలకు మునగాకుతో కూడిన కూరలు, పప్పు పెట్టాలని సూచించారు. మునగాకు రసాన్ని పాలల్లో కల్పిఇ ఇస్తే ఎముకలు బలంగా ఉంటాయని చెప్పారు. క్యాన్సర్‌ను తగ్గించే శక్తి మునగాకు ఉందన్నారు. అనంతరం మునగాకుతో తయారయ్యే పప్పు, ఫ్రై, పచ్చడి, చపాతి, కారం, పకోడి వంటి వంటకాలను తయారు చేసి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శివపార్వతి, డి.పద్మావతి, అంజలి, నాగమణి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

- మునగాకుతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని సీడీపీవో ఎం.సుచిత్ర అన్నారు. రేపల్లె పట్టణంలోని 1వవార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మునగాకు పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మునగాకు ప్రయోజనాలు వివరించారు. మునగాకుతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

21న పొన్నూరులో అష్టావధానం

భట్టిప్రోలు: బ్రాహ్మణ మహా సభ ఆధ్వర్యంలో ఈ నెల 21న సాయంత్రం 6:30 గంటలకు పొన్నూరులోని శంకర మఠంలో అష్టావధానం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నపల్లి సత్యన్నారాయణ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పులిపాక వేంకట సత్యసాయి వర ప్రసాద్, అవధాని నారాయణం బాల సుబ్రహ్మణ్యం, సంచాలకులు దీవి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రధాన రహదారులపై చేపల విక్రయాలు జరపవద్దు

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



మాట్లాడుతున్న ఏసీ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: తెనాలి- విజయవాడ ప్రధాన రహదారిపై చేపల విక్రయాలను నిషేధించడం జరిగిందని, అందరూ సహకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని చేపల వ్యాపారులతో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చేపల విక్రయాలు జరపడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. బస్టాండ్ సమీపంలో మరొక ప్రాంతాన్ని చూపిస్తామని, అక్కడే వ్యాపారులు చేసుకోవాలని తెలిపారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

గ్లోబల్ స్టాండర్డ్స్‌తోనే జాతీయ అవార్డుల సాధన

ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



డాక్టర్ రామ్‌చంద్‌ను సత్కరించిన శివకుమార్. పక్కన అతిథులు

తెనాలి: గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే వ్యవస్థాపకుని ఆశయాని కనుగుణంగా చదువుతోపాటు స్కిల్స్, వర్చువల్ సర్టిఫికేషన్స్, ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల్లో గ్లోబల్ స్టాండర్డ్స్‌ను కల్పిస్తున్నందునే ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీకి జాతీయ అవార్డులు లభిస్తున్నట్టు ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. ఎడ్యుస్కిల్స్- ఏఐసీటీఈ-జాతీయ ఇంటర్న్‌షిప్ పోర్టల్ 2023-2024 సంవత్సరాలకు వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో కాలేజీకి జాతీయస్థాయిలో మూడో ర్యాంక్, సౌత్, సెంట్రల్ జోన్స్‌లో 'బెస్ట్ ఫెర్ఫార్మింగ్ డిగ్రీ కాలేజ్', డిగ్రీ కాలేజీల విభాగంలో 'ప్రిన్సిపాల్ ఎక్స్‌లెన్స్ అవార్డు'లతోపాటు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ స్థానం లభించింది. శుక్రవారం సాయంత్రం కాలేజి సెమినార్ హాలులో నిర్వహించిన అభినందన సభలో కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్‌ను ఘనంగా సత్కరించారు. శివకుమార్ మాట్లాడుతూ, ఉన్నతమైన ఆశయాన్ని అధ్యాపకవర్గం అందిపుచ్చుకుని, విద్యార్థి ఉన్నతి లక్ష్యంగా ముందుకు సాగుతుండటం అభినందనీయమన్నారు. మోహన్ బాబు యూనివర్శిటీ ఓఎస్‌డీ తుమ్మల గోపాలరావు తన ప్రసంగంలో నవీన ఆవిష్కరణలతో శరవేగంగా మారిపోతున్న నేటి ప్రపంచంలో విద్యార్థుల్లో నిర్దిష్టమైన లక్ష్యం, సాధించాలనే తపన ఉన్నపుడే ఏదైనా సాధించగలరని చెప్పారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ, కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు నిరంతరం అప్‌డేట్ అవుతున్నందునే బైబిల్‌లో చెప్పినట్టు కృప మీద కృప లభిస్తోందని అన్నారు. కాకతీయ యూనివర్శిటీ రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ హైమావతి మాట్లాడుతూ, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ వ్యవస్థాపకుడి సంకల్పం గొప్పదన్నారు. లియో గ్లోబల్ సర్వీసెస్ ఓవర్సీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కాలేజీలకు పరిమితమైన ఇంటర్న్‌షిప్ కోర్సులను ఏఎస్ఎన్ కాలేజీ విద్యార్థులు వర్చువల్‌లో చేస్తుండటాన్ని అభినందించారు. తమ సంస్థ తరపున టెక్నికల్ వర్క్‌షాపు ఇస్తానని హామీనిచ్చారు. జేకేసీ కాలేజీ ఎంసీఏ డైరెక్టర్ డాక్టర్ వై.సురేష్ బాబు తన ప్రసంగంలో విద్యాబోధనలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నందునే ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ పలు విజయాలను సాధిస్తోందని చెప్పారు.

సత్కార గ్రహీత డాక్టర్ కొలసాని రామ్ చంద్ మాట్లాడుతూ కాలేజీ యాజమాన్యం ఇచ్చిన బాధ్యతాయుత అధికారాన్ని విద్యార్థుల భవిష్యత్ కోసం నిరంతర విద్యార్థిగా అప్‌డేట్ అవుతూ వారిని ముందుకు నడిపిస్తున్నట్టు చెప్పారు. ఇదే వేదికపై మానవత టీం డాక్టర్ రామ్‌చంద్‌ను సత్కరించింది. డాక్టర్ శారద స్వాగతం పలికారు.

పాలకులు ఫ్రీ అన్నారు.. మీ అభ్యంతరం ఏమిటీ?

- అందోళన చేసిన ట్రాక్టర్ యజమానులు
- కృష్ణా నదిలో ఇసుక తరలించడానికి సిద్ధమైన ట్రాక్టర్ నిర్వాహకులు
- అనుమతులు లేవంటూ అడ్డుకున్న రెవెన్యూ, పోలీసులు



రెవెన్యూ, పోలీస్‌లతో వాదోపవాదనలు చేస్తున్న ట్రాక్టర్ యజమానులు



ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న ఎస్ఐ కోటేశ్వరరావు

కొల్లిపర: 'ముఖ్యమంత్రి చంద్రబాబు ఎడ్లబండి, ట్రాక్టర్లకు ఇసుక ఫ్రీగా తీసుకెళ్లవచ్చు అని చెప్పటం జరిగిందని కావున మా ట్రాక్టర్‌లతో తాము ఇసుక తీసుకుపోతాం మీ అభ్యంతరం ఏమిటీ' అని రెవెన్యూ, పోలీసులపై ట్రాక్టర్ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన శుక్రవారం మండలంలోని కొత్త బొమ్మువాని పాలెం వద్ద కృష్ణానది కరకట్టపై చేసుకుంది. గురు వారం మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ సొంత అవసరాలకు ఉచితంగా ఇసుకను ఎండ్ల బండి, ట్రాక్టర్లు ద్వారా ఎక్కడైనా వాగులు, వంకల్లో 10 కిలో మీటర్లు దూరం లోపు మాత్రమే ప్రజలు తీసుకుపోవాలని ఆదేశాలు ఇచ్చారు. దీన్ని తప్పు దారి పట్టిస్తూ కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో కొంత మంది సీఎం ఇసుక తరలించే విషయం పై చెప్పిన విషయాలను తప్పుదారి పట్టించారు. నదిలో కూడా ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలించడానికి సీఎం మీడియా సమావేశంలో చెప్పినట్లు అందుకే ప్రక్కన ఉన్న కొల్లూరు, పెసర్లలంక, గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో కొంత మంది ట్రాక్టర్లు ద్వారా ఉచితంగా ఇసుకను తెనాలి చెరుకుపల్లి వంటి నగరాల్లోకి తీసుకుపోతున్నారని రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో వాదోపవాదనలకు దిగారు.

దీంతో ఎస్ఐ కోటేశ్వరరావు కృష్ణానది వద్దకు వచ్చి ట్రాక్టర్లు తీసుకు వచ్చిన వారితో మాట్లాడుతూ ఉన్నతాధికారుల వద్ద నుంచి కృష్ణా నదిలో ట్రాక్టర్లు ద్వారా ఉచితంగా తరలించే విషయం పై ఎటువంటి ఆదేశాలు రాలేదని వివరించారు. ఆదేశాలకు సంబంధించి పత్రాలు ఉంటే వాటిని చూపించాలని కోరారు. వారి వద్ద ఎటువంటి పత్రాలు లేవని సమాధానమిచ్చారు. వేరే మండలాల్లో జరుగుతోంది అన్న విషయాలకు తమకు ఎటువంటి సంబంధం లేదని, కొల్లిపర మండలంలో కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు.

దీనిపై ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక తహసీల్దారుకు, లేదా ఉన్న అధికారులకు సమస్యలు తెలిపి వారి వద్ద నుంచి అనుమతి తెచ్చుకోవాలన్నారు. దీంతో అప్పటి వరకు జరిగిన వాదోపు వాదనలకు తెరపడింది. ట్రాక్టర్లు తీసుకువచ్చిన వారంఅంతా స్థానిక తహసీల్దారు, నేతలను కలిసేందుకు తరలివెళ్లారు.

ఏది ఏమైనా మీడియా సమావేశంలో సీఎం ఉచిత ఇసుక విధానంపై పూర్తి సమాచారం చెప్పకపోవటంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే ఇసుక లేక చాలామంది గృహనిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఉచిత ఇసుక ఏ ప్రాంతాలకు వర్తిస్తుంది. వాటి నియమ నిబంధనలు ఏమిటీ అన్న విషయాలు క్షణంగా తెలియజేస్తే బాగుంటుందని ప్రజలు, గృహ వినియోగదారులు భావిస్తున్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



వ్యర్థాలను తొలగించాలని ఆదేశిస్తున్న ఏసీ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లపై వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారుజాము నుంచి ఉదయం లోపు వాటిని ప్రతి రోజు తొలగించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన పెయింటర్ చావలి రాజేష్ (38) భార్య కొంత కాలం క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రమ్మన్నా రావడంలేదు. మస్తాపానికి గురైన అతను గురువారం రాత్రి మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వాత మృతి చెందాడు. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ నిస్సార్ బాషా తెలిపారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ రామలింగేశ్వరపేట డిపో సెంటరుకు చెందిన నీలం సాయితేజను కబేళా వంతెన వద్ద ముత్తెంశెట్టిపాలెంకు చెందిన రామకృష్ణ మరో నలుగురు దాడి చేసి గాయపర్చారు. బాధితుడు శుక్రవారం రాత్రి పోలీసులకు ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన టౌన్ పోలీసులు తెలిపారు.